# క్రిందికా? పైకా?

"యెదటింటివారి అల్లుడు చచ్చిపోయేడు. వారి యిరవైయేళ్ళ కూతురు ముండా మోసిందన్నారు. "మొగుడు చచ్చిపోతే ముండా మొయ్యాలా? అయితే నన్నెందుకు ముండామొయ్యనియ్యలేదూ?" అని అడిగేను. మా అమ్మానాన్నా మళ్ళీ యేడ్చేరు. యెదటింటివారి పిల్ల నగలన్నీ తీసేసుకుంది. తెల్ల పంచెలు కట్టుకునీది. తలకట్టుమాత్రం తీసుకోలేదు. ఆపిల్లతో జతగా వుంటే నేనూ అలాగే వుంటానని కాబోలు మాఅమ్మ నాకు ఆపిల్లతో జతచేసింది.

"ఆపిల్ల పేరు రాధాబాయి. నాపేరు కృష్ణవేణమ్మ. ఇద్దరికీ బాగా స్నేహం కలిసింది. నేను దాన్ని "రాధా" అని పిలిచీదాన్ని. నన్నది "కృష్ణా" అని పిలిచీది. రెండుపేర్లూ కలిపితే రాధాకృష్ణులయింది. వాళ్ళ తాతా; నిద్రపోయి లేచేటప్పుడూ భోంచేసేటప్పుడూ - యింకా అనేక సందర్భాల్లో రాధాకృష్ణా అనీవాడు. మొదట మమ్మల్ని యిద్దర్నీ పిలుస్తున్నాడనుకొనీదాన్ని. తరువాత రాధ కొంత సంగతి చెప్పింది. పూర్తిగా తెలిసింది గాదు. "రాధాకృష్ణులంటే యెవ"రని మానాన్న నడిగేను. "రాధాకృష్ణులా? - రాధాకృష్ణులా? తరవాత చెబుతానులే" అని మానాన్న దాటేశాడు; గాని నేను వూరుకోలేదు.

"రాధ అన్నపేరు నారాయణమూర్తి. అతను భోగందాన్నుంచకున్నాడని చెప్పుకునీవారు. అస్తమానూ అత్తరువులో మునిగితేలి వుండీవాడతను. పెళ్ళాం చచ్చిపోయింది. మళ్ళీ పెళ్ళాడలేదు. "మీ అన్నయ్య యెందుకు పెళ్ళాడలేదే" అంటే "భోగంది వుంది చాలదూ?" అంది రాధ. "రాధాకృష్ణులంటే యెవరు" అని నేను వాణ్ణి అడిగేను. వాడిపేరే నారాయణమూర్తి. నలుపేగాని కొంచెం అందగాడే. అంతా చెప్పేడు. చెప్పి చెప్పి బుగ్గమీద పొడిచి వెళ్ళిపోయేడు."

"నేనస్తమానూ వాళ్ళ యింట్లోనే వుండీదాన్ని. రాధ తల్లి తెగులుకొంటి దయిపోయింది. రాధే యింట్లో ఆడదిక్కయింది. ముసలాడు చచ్చిపోయాడు. రాధతండ్రి దాని చిన్నతనంలోనే చచ్చిపోయాట్ట"

"మా వదిన కాపరానికి వచ్చింది. అప్పుడే మా అన్నయ్యకి వుద్యోగం అయింది. నెలకి నూరు రూపాయల జీతం. మాఅన్నయ్య మా వదినికి నెలకి పాతిక రూపాయలిచ్చేవాడు. నాకు అయిదు రూపాయలు ఇచ్చేవాడు. మా వదిన నేనంటే ప్రాణంగా చూచుకునీది. మొదటిమాటు వచ్చి మావదిన నెల్లాళ్ళుండి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ నెల్లాళ్ళూ నేను రాధ యింటికి అట్టే వెళ్ళలేదు. "ఇంక నాఅవసరం యేమిటీ నీకూ?" అంది రాధ. "అలా అనకు" అన్నాను నేను. మళ్ళీ అస్తమానూ అక్కడే కూచోడం మొదలు పెట్టేను నేను."

"నారాయణమూర్తి నన్ను వేళాకోళాలు మొదలుపెట్టేడు. మళ్ళీ యెదురు వేళాకోళాలు చెయ్యమని రాధ నన్ను పురికొల్పింది. ఆ మాయలో పడిపోయాను నేను. నారాయణమూర్తి వేళాకోళాలు ముదిరేయి. చిన్న చిన్న లెంపకాయలు మొదలుపెట్టేడు. చెప్పుకుంటే సిగ్గూ. నన్ను విడిచివెళ్ళీవాడు కాడు. ఆరోజుల్లో నేనూ వాణ్ణి విడిచి వుండలేకపోయిదాన్ని. వాడు మంచినీళ్ళు అడిగితే రాధ నాచేత యిప్పించీది. అప్పుడప్పుడూ నాచేత తనపట్టుపంచి కట్టుకోమని అన్నం కూడా పెట్టించీది. వకనాడు అలా చేస్తూంటే నాకోసం వెతుక్కంటూ వచ్చి మా వదిన చూసింది. అక్కడ యేమీ అనలేదు; గాని పసుందని క్షణమైనా వుండకుండా యింటికి తీసుకువెళ్ళింది."

"మా వదిన చాలా గడుసు మనిషి. నా మనస్సుకి కష్టం తోచకుండా వాళ్ళ యింట్లో జరిగీ సంగతులన్నీ నానోటితోనే తెలుసుకుంది. మావదిన వకపూట తీవ్రంగా ఆలోచించింది. "మొగుడిమీదకి మనస్సు పోతోందో" అని అడిగింది. నేను సిగ్గులేకుండా "అవున"న్నాను"

"పెళ్ళిచేసుకుంటావా?"

"ఎవరు చేస్తారు?"

"ఎవరో? పెళ్ళి చేసుకుంటావా?"

"మొగుడేడీ?"

"అదంతా నీకెందుకూ? పోనీ నారాయణమూర్తిని పెళ్ళాడతావా?"

"ఛీ! నీమనస్సు తెలిసేక వాణ్ణి తలుచుకుంటే వొళ్ళు మండుతోంది నాకు. దుర్మార్గుడు చెరపడానికి సిద్ధపడ్డాడు."

"పోనీ యెవరిమీద వుంది నీకూ?"

"ఇదివరకు నాకావూహ తోచలేదు. ఎవరినీ తలుచుకోలేదు."

"పెళ్ళాడతావా?"

"ఆఁ"

"సరే. పెళ్ళికొడుకుని యిక్కడికే రప్పిస్తాను. - చూచుకుందువుగాని"

మావదిన మాటలు వినగా నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆమె నన్నడిగినప్పుడు తొణక్కుండా జవాబులు చెప్పేశాను; గాని తరువాత సిగ్గుపడ్డాను. చాల సిగ్గయింది. ఎంతోసేపు నొచ్చుకున్నాను. మా అమ్మ యెన్నిమాట్లు అన్నా భోజనానికి వెళ్ళలేదు. మావదిన పసికట్టి బుజ్జగించి తీసుకువెళ్ళింది."

"రాధ యింటికి వెళ్ళడం మానేశాను. అది గూడా నా విషయంలో చెడ్డతలంపు తలిచింది అని అనుమానం పుట్టింది. దాని మొగం చూడగూడదనుకున్నాను. పిలిచింది. "మీ యింటికిరాన"న్నాను. "రావా" అన్నాడు నారాయణమూర్తి. నేను మాట్లాళ్ళేదు. "జ్ఞాపకం వుంచుకో" అన్నాడు వాడు"

"నాలుగురోజులుకి మాయింటికి మావదిన పింతల్లి కొడుకు వచ్చాడు. ముప్ఫయియేళ్ళు వుంటాయి. చామనచాయ, ఆకాటుకళ్ళూ, మల్లెమొగ్గలాంటి పలువరుసా, మనోహరమైన కంఠధ్వనీ చూశేటప్పటికి మోహం పుట్టింది."

"మొదట ఆయనకే నన్నిస్తా నన్నాడుట మానాన్న. కట్నంలో కుదిరిందికాదుట. ఇద్దరు పెళ్ళాలు కాపరానికి రాకుండానే పోయారుట ఆయనకి. "నేనిక్కడ వుండగా భోజనం యెక్కడో చేసివస్తావా" అంది మావదిన. "మీ యిల్లు కనుక్కోలేకపోయా" నన్నారాయన. "ఈపూట వుండాలి సుమా" అంటే "రాత్రికి యింటికి వెళ్ళాల"న్నాడు. నాకు ఆశపుట్టింది. మా వదిన తోటి మాట్లాడి వెళ్ళిపోయారు."

"దీపాలు పెట్టేక మానాన్న, మా అన్నయ్యా చెన్నపట్నం వెళ్ళేరు. మా అమ్మ వారంరోజుల కిందట తమ్ముడి గారి యింటికి వెళ్ళింది. మావదినా నేనూ భోంచేసి హాలులో కూచున్నాము. పదిగంటలయేక గుమ్మంలో యెవరో వచ్చి నుంచున్నారు. తలుపుతీసి మావదిన లోపలకి రమ్మంది. చూడగా నాకోసం వచ్చినవారే. నాకు సిగ్గు వచ్చి లేచిపోయాను."

"హాల్లో కొంతసేపు గుసగుస లయినాక మా వదిన గదిలోకి వచ్చి "నీతరవాయే" అంది. తలవూపాను. "వుండు" అని యామె వెళ్ళిపోయింది. చిరునవ్వుతో ఆయన వచ్చాడు. "ఎన్నాళ్ళకి తక్కేవూ? అన్నివిధాలా ఆశ వదులుకున్నాను. గాని భగవంతుడు అనుగ్రహించాడు" అని ఆయన నా చెయ్యి పట్టుకున్నారు. నా శరీరం జలదరించింది. మా వదిన వచ్చి నాచేత వప్పించి ఆయన్ని తీసుకుపోయింది."

"రాత్రి పండ్రెండుగంటల వేళ నాచేత తాంబూలం యిప్పించి మావదిన ఆయన్ని పంపివేసింది."

"వారం రోజులు గడిచేయి. మా అమ్మ వచ్చింది. నేను మామూలుగానే వున్నాను. మరి రెండుదినాలు గడిచిపోయినవి. "నీ ప్రయాణం యీవేళే" అంది మావదిన. "రాత్రి పండ్రెండు గంటలవేళ మనవీధిలోకి బండి వస్తుంది. యెక్కి కూడా వెళ్లిపో" అంది. నాకు సిగ్గు వచ్చింది. భయం వేసింది. కాళ్ళువణికేయి."

"పన్నెండు గంటలయింది. మా అమ్మ గాఢ నిద్రలో వుంది. మా వదిన అన్నీ సిద్ధం చేసింది. బండి వచ్చింది. మావదిన తొందరపెట్టగా మాట్లాడకుండానే బండి యెక్కేను. క్షణంలో బండి రైలుస్టేషను చేరింది. రైలెక్కి రాత్రి రెండుగంటలికి రాజమండ్రీ చేరాము. నాలుగు గంటలకు వీరేశలింగంపంతులుగారు మావదిన పింతల్లి కొడుకయిన - మాధవరావుగారికి నన్ను పెండ్లి చేశారు."

"రెండురోజులు గడిచిపోయినవి. మూడోనాటి రాత్రి వంటిగంట వేళ పంతులుగారు పిలువగా నాభర్త లేచి వెళ్ళెను. అంత రాత్రివేళ యేంపని వచ్చిందో అని నేను ఆలోచించుకుంటూ వుండగా నా భర్తగారు వచ్చి మీనాన్నా, మీఅన్నయ్యా

వచ్చేరు. నిన్ను చూస్తారుట. సంతోషంగానే వున్నారు" అని చెప్పిరి. నాకు భయమూ సిగ్గూగూడా వచ్చేయి. కాని "భయంలేదు" అని నన్ను బుజ్జగించి నాభర్త బైటకు వెళ్ళేరు. ఉత్తరక్షణంలో పంతులుగారూ, మానాన్న, మాఅన్నయ్యా లోపలకు వచ్చారు"

"నేను మొగం యెత్తి చూడలేకపోయాను. "సుందరమ్మా, భయపడకు. మంచిపని చేశావు. నేను స్వయంగా సాహసించలేకపోయాను. పంతులుగారు నీ వివాహ వార్త పత్రికలో ప్రకటించగా చూసి ఆనందించి బహిరంగంగా వచ్చి చూడ్డానికి సాహసం లేక అర్ధరాత్రి వచ్చేము. చేతులో యేమీలేదు, ఇంటికి వెళ్ళి పంపిస్తాన"ని మా నాన్న చెప్పేడు. "దణ్ణం పెట్టమ్మా" అన్నారు పంతులుగారు. వెంటనే కాళ్ళమీద పడ్డాను. మానాన్న లేవదీసి "సుఖపడు" అన్నాడు. మానాన్న వెళ్ళిపోయేటప్పుడు "వదిన్ని చూడాల"ని వుందని చెప్పేను. "సరే" అన్నాడు మానాన్న."

"మరి రెండుదినాలు గడచిపోయేక అలాగే అర్ధరాత్రే మాఅమ్మా, వదినా, మానాన్నా వచ్చారు. నాకు సిగ్గు తలమునకలయింది. తుదకి మాట్లాడేను. మానాన్న నాకు అయిదువందలరూపాయలిచ్చేడు. మాఅమ్మ నానగలన్నీ యిచ్చేసింది. మావదిన బ్రహ్మానందపడింది."

"నాభర్త గారికి పెళ్ళిఅయిన రెండుమాసాలికి డిప్యూటీతహసీల్దారీ అయింది. వారు నన్ను పువ్వుల్లో పెట్టుకుని పూజిస్తున్నారు."

నిజంగా నారాయణమూర్తికి నేను వడ్డించేటప్పుడు మావదిన చూసి వుండకపోతే నేను అంధకారకూపంలో పడిపోయి కుళ్ళివుందును. మావదిన చాలా మంచిమనిషి కాకపోతే నాబతుకు అపకీర్తి పాలయివుందును. అలాంటిదేమీ తటస్థించకుండా నేనిప్పుడు యిలా స్వర్గసుఖం అనుభవిస్తూవుండడం మావదిన వల్లనే."

"ఆమెను నేను నాజన్మంలో మరవను. ఆమెని నేను యిలవేల్పుగా పూజించుకుంటున్నాను. ఆడదానికి భర్తతో వుండడం తప్పు గాకపోతే నాకిప్పుడు తటస్థించినది అధోగతిగాదు, ఊర్ధ్వగమనమే"

❀ ❀ ❀